

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల

కొండాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం అధికారులు నీరు విడుదల చేశారు. గండికోట ప్రాజెక్టు వద్ద మూడు గేట్లు ఎత్తి 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మైలవరం ప్రాంత రైతుల అవసరాల దృష్ట్యా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట నుంచి పైడిపాలెం రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందన్నారు. .

తులంతూగలేం..

- 10 గ్రాముల బంగారు రూ.లక్ష
- పసిడి ధర పరుగులు
- తగ్గిపోయిన బంగారు కొనుగోళ్లు
- పనులు లేక అల్లాడుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. కొంతకాలం నుంచి అందరూ అనుకుంటున్నట్టుగానే 24 క్యారెట్ల తులం (10గ్రాములు) బంగారం రూ.లక్షకు చేరింది. సామాన్యులు ఇక బంగారు ఆభరణాలకు దూరం అయ్యే పరిస్థితి వచ్చింది. బంగారు ఆభరణాలు అలంకరణ, స్టేటస్ కోసం కాకుండా నేడు పెట్టుబడిగా మారిపోయాయి. దీంతో మధ్యతరగతి నుంచి ఎగువతరగతి వరకు బంగారంపై పెట్టుబడులు పెడుతూ బిస్కట్‌లు కొంటున్నారు. గత ఏడాది అక్టోబరు 3వ తేదీన తులం బంగారు రూ.77,500 ఉంటే ఈ ఏడాది జనవరి 1న రూ.78,600కి చేరింది. అంటే మూడునెలల కాలంలో కేవలం రూ.1100 మాత్రమే పెరిగింది. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. జనవరి1న రూ.78,600 ఉన్నది అదే నెల 31కి రూ.83,700కు చేరింది. ఫిబ్రవరి 28వ తేదీ నాటికి రూ.87,700, మార్చి 31 నాటికి రూ.92,000 లకు చేరింది. ఏప్రిల్ 1వ తేదీకి రూ.93,100 ఉన్న తులం బంగారం మంగళవారం రూ.లక్షకు చేరుకుంది. కేవలం 22 రోజుల్లోనే ఏడువేల రూపాయల ధర పెరగడంపై వ్యాపార వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

గత ఏడాది నుంచి బంగారు ధరలు స్థిరంగా లేకపోవడంతో కొనుగోళ్లు భారీగా తగ్గుతూ వచ్చాయి. తులం బంగారు లక్షకు చేరడంతో అమ్మకాలు ఇంకా తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో వ్యాపారులకే కాకుండా బంగారు పనిచేసే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిపోయింది. ఈ ఏడాది నుంచి బంగారు ఆభరణాలు తయారు చేసే కార్మికులు ఆ ఉపాధి నుంచి దూరం కావాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి పనులు రాక పోవడంతో కొందరు ఆటో నడుపుకోవడం, దినసరి కూలిగా భవననిర్మాణ కార్మికులుగా పొట్ట నింపుకోవడానికి వెళుతున్నట్లు వెల్లడిస్తున్నారు.



అంతర్జాతీయ పరిస్థితులే కారణం

బంగారం ధరలు అమాంతం పెరుగుతూ పోవడానికి అంతర్జాతీయ పరిస్థితులే కారణం. రష్యా ఉక్రేయిన్ వార్‌తో పాటు మిడిల్ ఈస్ట్‌లో సాగుతున్న యుద్ధాలు.. దీనికి తోడు ట్రంప్ పన్నుల విధానంతో మదుపరులు షేర్ల మీద పెట్టుబడులు తగ్గించి బంగారం మీద పెడుతున్నారు. అంతేకాకుండా 2024 చివరి వరకు దాదాపు 14 దేశాలు భారీగా బంగారు నిల్వలను కొనుగోలు చేశాయి. బంగారం తులం రూ.1,20,000 వరకు వెళుతుంది. ప్రొద్దుటూరు మార్కెట్‌లో బంగారు కొనుగోళ్లు 80 శాతం పడిపోయాయి.

- బుశెట్టి రామ్మోహన్, గోల్డ్, డైమండ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు

రెండోవిడత రీసర్వేకు సిద్ధం



- 23 మండలాల్లో 40,385 ఎకరాలు లక్ష్యం
- గ్రామసభలు, ర్యాలీలతో రైతులకు అవగాహన
- అందుబాటులో లేని రైతులకు వాట్సాప్ ద్వారా సమాచారం

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రీసర్వే శరవేగంగా సాగుతోంది. రైతులు సంతృప్తి పొందేవరకు ఎన్నిసార్లు అయినా రీసర్వే చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాలను సర్వే, రెవెన్యూ అధికారులు పాటిస్తున్నారు. వైసీపీ పాలనలో తప్పుల తడకగా మారిన రీసర్వేపై రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 6,300 ఫిర్యాదులు పరిష్కరిస్తూనే.. మరో పక్క కూటమి సర్కారులో తొలివిడత రీసర్వే 36 మండలాల్లో పూర్తిచేశారు. ఈనెలలో ప్రారంభం కానున్న రెండోవిడత సర్వేకు సంబంధించి 23 మండలాల్లో 23 గ్రామాలను ఎంపిక చేశారు. రెండువారాలుగా అక్కడ రైతులను, ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించే దిశగా గ్రామ సదస్సులు, ర్యాలీలు, టాంటాంలు నిర్వహించారు.

జగన్ హయాంలో రీసర్వేపై ఫిర్యాదులు

జగన్ పాలనలో 285 గ్రామాలో నాలుగేళ్లపాటు 4,66,461 ఎకరాలకు రీ సర్వే జరిగింది. అప్పట్లో రీసర్వే సమయంలో భూ యజమానులకు నోటీసులు సక్రమంగా ఇవ్వలేదు. రీసర్వేలో రైతుల సందేహాలను నివృత్తి చేయలేదు. భూ హక్కుదారుడు అందుబాటులో ఉన్నా, లేకున్నా పట్టించుకోకుండా ఆగమేఘాల మీద రీసర్వే సాగడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రికార్డుల్లో ఉన్న భూముల కంటే తక్కువగా చూపి హద్దులు వేయడంతో పెద్ద దూమారం రేగింది. భూముల హద్దులకు కూడా జగనన్న బొమ్మలతో రాళ్లు చెక్కించి నాటించడం, పాస్‌బుక్కుల్లో భూమి హక్కుదారుడు ఫొటో స్థానంలో జగన్ బొమ్మలు పెద్దవిగా ముద్రించడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తం కావడంతో.. ఎన్నికల సమయంలో చంద్రబాబు సర్కారు ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టగానే జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష రద్దు చేశారు. జగన్ హయాంలో చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లా 6,300 ఫిర్యాదులు అందాయి. అధికారులు, సిబ్బంది సమన్వయంతో రైతుల్లో నెలకొన్న సందేహాలు నివృత్తి చేశారు.

డివిజన్ల వారీగా రీసర్వే చేసే ప్రాంతాలివే..

- కడప డివిజన్‌లో కమలాపురంలోని ఎల్లారెడ్డిపల్లి, ఖాజీపేటలో చెన్నముక్కపల్లి, సిద్దవటంలోని కడపాయపల్లి, వల్లూరులోని చిన్నపుత్త, పెండ్లిమర్రిలో చాబలి, చెన్నూరులోని బయనపల్లెల్లో మొత్తం 11,089.79 ఎకరాలలో సర్వే జరగనుంది.
- పులివెందుల డివిజన్‌లో తొండూరులో యాదవకుంట, వేంపల్లిలో అలవలపాడు, వేములలో చింతలకుంట గ్రామాల్లో 5,225.51 ఎకరాలలో సర్వే చేస్తారు.
- బద్వేలు డివిజన్‌లో అట్లూరులోని గుజ్జులవారిపల్లి, బి.కోడూరులోని కొండంపల్లి, కలసపాడులోని అయ్యవారిపల్లి, పోరుమామిళ్లలోని వెంకటరామాపురం, మైదుకూరులోని ముదిరెడ్డిపల్లి, కాశినాయన మండలంలో పగడాలపల్లెల్లో మొత్తం 14,541.16 ఎకరాల్లో సర్వే జరగనుంది.
- జమ్మలమడుగు డివిజన్‌లో కొండాపురంలోని జోగాపురం, దువ్వూరులోని బాలక్కవారిపల్లి, ప్రొద్దుటూరులో రేగులపల్లి, జమ్మలమడుగులోని తూగుట్లపల్లి, మైలవరంలోని కోనఅనంతపురం, పెద్దముడియంలోని గోపలాపురం, చాపాడులోని ముద్రాయపల్లి, రాజుపాలెం మండలంలో గోపాయపల్లెలో మొత్తం 9,129.97 ఎకరాలలో రెండోవిడత రీసర్వే జరగనుంది.

పక్కా ప్రణాళికతో రీసర్వే

రెండో విడత రీసర్వే జరిగే మండలాలు, గ్రామాలను ఎంపిక చేశారు. 86 బ్లాకులుగా విభజించారు. దాదాపు 40,385.91 ఎకరాల భూమిని గుర్తించారు. అందులో 22,130.19 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా 18,256.72 ఎకరాల పట్టా భూములను రీ సర్వే చేయనున్నారు. ఇందుకోసం పక్కాగా కొలతలు వేసేందుకు ఆధునిక సాంకేతికతతో రూపొందించిన 45 రోవర్స్ సిద్ధం చేశారు. ఇప్పటికే రెవెన్యూ రికార్డులను చేత పట్టుకుని ప్రభుత్వ డీకేటీ, దేవదాయ, వక్ఫ్, వంకలు, వాగులు అసైన్డ్, గ్రామకంఠం భూముల హద్దులను రెవెన్యూ, రీసర్వే అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. రీసర్వే ప్రణాళిక ప్రకారం తప్పులు లేకుండా పూర్తిచేసే బాధ్యత డిప్యూటీ తహశీల్దార్లకు అప్పగించారు. ఒకవేళ రీసర్వే సమయంలో భూములకు సంబంధించిన హక్కుదారులు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉంటే వారికి వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. వారి ఆమోదం తెలిపిన మీదటే సర్వే పూర్తిచేస్తుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.



పారదర్శకంగా రీసర్వే

ఇప్పటికే మొదటి విడత రీసర్వే పూర్తి చేశాం. రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. అదే స్ఫూర్తితో రెండోవిడత రీసర్వేకు సంబంధించిన పనులు మా సిబ్బంది పూర్తి చేశారు. గ్రామాల్లో రైతులకు నోటీసులు, గ్రామ సభలు, ర్యాలీలతో అవగాహన కల్పిస్తున్నాం. పారదర్శకంగా రైతు సంతృప్తి చెందేవరకు రీసర్వే రీసర్వే జరుగుతుంది.

- మురళీకృష్ణ, సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

తిరుమలలో యువకుడి ఆత్మహత్య

తిరుమల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని ఏటీసీ వద్ద మరుగుదొడ్డిలో గణేష్ (16) అనే యువకుడు ఉరి వేసుకుని ఉండటాన్ని పారిశుధ్య కార్మికులు గుర్తించారు. వెంటనే పోలీసులు, విజిలెన్స్ అధికారులకు తెలియజేశారు. మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. మృతుడు రాయచోటికి చెందిన గణేష్‌గా పోలీసులు తేల్చారు. ఇతడి అన్న తిరుమలలోని టీ స్టాల్‌లో పనిచేసున్నాడు. అడిగిన డబ్బులు అన్న ఇవ్వలేదని మనస్తాపంతో గణేష్ ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. మృతదేహాన్ని ఆగమేఘాలపై తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి కాకుండా తిరుపతికి తరలించడంపై తొలుత అనుమానాలు వ్యక్తమయ్యాయి.

హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి

- జూనియర్ కళాశాలలుగా మార్చాలనే యోచన
- మండలానికి ఒక కళాశాల ఉండేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు

7

ప్రతీకారంతోనే హత్య

- నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



దళితులకు అన్యాయం జరగకూడదు

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, సామాజిక అసమానతలు నిర్మూలించేందుకు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్పీ అశోక్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిమ్నవర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. దళితులు ఎక్కడా అన్యాయానికి గురి కాకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలు పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, డిఎస్పీలు, ఎస్సీ కార్పొరేషన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం జిల్లాకు రానున్నారని ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి బుధవారం రాత్రి 9 గంటలకు కడప ఆర్ అండ్ బీ గెస్ట్ హస్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 8-30 నుంచి 9-30 గంటల వరకు కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను సందర్శిస్తారు. 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కలెక్టర్‌తో కలసి ఎంఎస్ఎంఈపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3-30 గంటలకు కడప విమానాశ్రయం నుంచి విశాఖపట్నం వెళతారని డీఆర్వో తెలిపారు.

సివిల్స్‌లో మెరిసిన జిల్లావాసులు

కడప ఎడ్యుకేషన్ / చెన్నూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన ముగ్గురు మంచి ర్యాంకులు సాధించారు. కడప నగరానికి చెందిన చెన్నంరెడ్డి శివగణేశ్‌రెడ్డి 119 ర్యాంకు సాధించగా, చెన్నూరుకు చెందిన నేలటూరు శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు, కడప నాగరాజపేటకు చెందిన పూల ధనుష్ 232 ర్యాంకు సాధించారు.

చెన్నంరెడ్డి శివగణేశ్‌రెడ్డి (119)



కడప నగరం అలంఖాన్‌పల్లెకు చెందిన చెన్నంరెడ్డి శివగణేశ్‌రెడ్డి తండ్రి మల్లికార్జునరెడ్డి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేశారు. తల్లి ఇందిరా ప్రియదర్శిని గృహిణి. శివగణేశ్‌రెడ్డి కడప బాలవికాస్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నారు. నెల్లూరు నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ పూర్తిచేశారు. అనంతరం ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. తొలి రెండుసార్లు సివిల్స్‌లో విఫలమైనప్పటికీ మూడవసారి సివిల్స్‌లో 119వ ర్యాంకు సాధించారు. దీంతో స్వగ్రామం అలంఖాన్‌పల్లెలో కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నేలటూరు శ్రీకాంత్‌రెడ్డి (151)



చెన్నూరుకు చెందిన రైతు కుటుంబానికి చెందిన నేలటూరు వెంకటసుబ్బారెడ్డి, సావిత్రిల కుమారుడు నేలటూరు శ్రీకాంత్‌రెడ్డి 8వతరగతి వరకు కడపలోని నాగార్జున హైస్కూలులో, పదో తరగతి వరకు భాష్యం పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ నెల్లూరు నరసింహకొండ నారాయణస్వామి కాలేజీలో, బీటెక్ ఇండోర్‌లో చదివారు. 2019 నుంచి రెండేళ్లపాటు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేశారు. 2021లో ఉద్యోగం మానేసి బెంగళూరులోని ఇన్‌సైట్ కోచింగ్ సెంటరులో చేరి సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్నారు. 2022-23లో సివిల్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. గత ఏడాది మెయిన్స్ గట్టెక్కలేదు. మరింత పట్టుదలగా చదవి పరీక్షలు రాయడంతో తాజాగా వచ్చిన ఫలితాల్లో 151వ ర్యాంకు సాధించారు.

ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో..

- నేలటూరు శ్రీకాంత్‌రెడ్డి

ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యమే సివిల్స్‌లో ర్యాంకు సాధించేందుకు కారణమైంది. ఇష్టపడి చదివితే ఎంత కష్టాన్నైనా అధిగమించచ్చు. ప్రతి ఒక్కరూ తాము ఏం చేయాలో ఎలా చదవాలో ఏ విధంగా చదవాలో నిర్దేశించుకుని ఇష్టపడి చదివితే ర్యాంకు సాధించే అవకాశం ఉంది. నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చారు. వారి కష్టానికి వారి ఆశలకు అనుగుణంగా నేను ప్రజలకు సేవ చేస్తా.



తల్లిదండ్రులతో పూల ధనుష్

పూల ధనుష్ (232)

కడప నాగరాజుపేటకు చెందిన పూల ధనుష్ తండ్రి పూల శ్రీనివాసులు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తల్లి నాగమణి రైల్వేలో సీనియర్ ఆడిట్ అధికారి. వీరి కుటుంబం చాలాకాలం క్రితం హైదరాబాద్ వెళ్లిపోయింది. దీంతో ధనుష్ విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే పూర్తిచేశారు. గత ఏడాది విడుదలైన యూపీఎస్సీ ఫలితాలలో 480వ ర్యాంకు సాధించి ప్రస్తుతం సిమ్లాలో ఐడీఏఎస్‌లో ప్రొబెషనరీ అధికారిగా పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే మరోసారి యూపీఎస్సీ పరీక్ష రాసి 232వ ర్యాంకు సాధించారు. ఈయన పెదనాన్న పూల చలపతి జిల్లా బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్నారు.

పదిమంది ఎస్‌ఐల బదిలీ

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పదిమంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలు తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
పి.ప్రతాప్‌రెడ్డి	కడప ట్రాఫిక్	కడప వన్‌టౌన్
వై.జయరాములు	రిమ్స్	కడప ట్రాఫిక్
సునీల్‌కుమార్‌రెడ్డి	సైబర్ క్రైం, కడప	కలమల్ల
పి.హనుమంతు	కాశినాయన	ప్రొద్దుటూరు త్రీటౌన్
యోగేంద్ర	ప్రొద్దుటూరు త్రీటౌన్	కాశినాయన
కేసీ రాజు	బి.కోడూరు	ప్రొద్దుటూరు రూరల్
వెంకటసురేశ్	ప్రొద్దుటూరు రూరల్	బి.కోడూరు
శివప్రసాద్	ఒంటిమిట్ట	బి.మఠం
చంద్రశేఖర్	బి.మఠం	చక్రాయపేట
బీవీ క్రిష్ణయ్య	చక్రాయపేట	బీసీఆర్‌బీ, కడప

జిల్లా ప్రధాన జడ్జిగా యామిని బాధ్యతలు



జిల్లా ప్రధాన జడ్జి యామినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన జడ్జిగా సి.యామిని మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా ప్రధాన జడ్జిగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా.. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో జిల్లా ప్రధాన జడ్జి సి.యామినిని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవ్యవస్థ, పోలీస్‌శాఖ కలిసి సమన్వయంతో పనిచేసి ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా చూసేందుకు చేపట్టాల్సిన చర్యలపై వీరిద్దరూ చర్చించారు.

అందరినీ అక్షరాస్యులను చేయాలి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన రెండవ విడత ఉల్లాస్ నిర్వహణపై జిలా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో నిరక్షరాస్యతను సమూలంగా నిర్మూలించాలన్నారు. అందుకే రాష్ట్రప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇప్పటికే ఒక విడత ఈ కార్యక్రమం పూర్తి కాగా 2వ విడత సెప్టెంబరు వరకు కొనసాగుతుందన్నారు. వివిధ సామాజిక వర్గాల ప్రజలను ఎంపిక చేసి 6 నెలల పాటు ఆయా గ్రామాలు, వార్డులలోనే అక్షర జ్ఞానాన్ని అందిస్తామన్నారు. 2025-26లో జిల్లాలో మొత్తం 33,132 మందికి అక్షరాస్యత లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అందుకు అనుగుణంగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, జిల్లా వయోజన విద్య డీడీ వెంకటసుబ్బారెడ్డి, డీపీవో రాజ్యలక్ష్మి, డీఈవో షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం రూపొందించిన 'మన మిత్ర' వాట్సాప్ సేవల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.



మనమిత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పశు సంచార వైద్యశాలలకు 'రైట్ రైట్'

- నెలాఖరుకల్లా గ్రామాల్లో వైద్యసేవలు
- పాడి రైతులకు ఎంతో ఉపయోగం



మదనపల్లె పశువుల ఆస్పత్రిలో మూలనపడ్డ సంచార వైద్యసేవల వాహనం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పశువులకు అత్యవసర వైద్య సేవలందించడానికి పశు సంచార వైద్యశాలలు ఎంతో ఉపయోగపడేవి. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ, మందుల పంపిణీ తదితర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంచార పశువైద్యశాలల సేవలు సగానికి సగం నిలిచిపోయాయి. వీటి ఆవశ్యకత గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెలాఖరుకల్లా పశు సంచార వైద్యశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంది.

1962 టోల్‌ఫ్రీ నెంబర్‌తో...

108 తరహాలోనే 1962 నెంబర్‌కు పాడి రైతులు ఫోన్ చేస్తే వారి గ్రామాలకు పశు సంచార వైద్యశాలలు వెళతాయి. అక్కడ పశువులకు ప్రాథమిక చికిత్సలు, చిన్న చిన్న శస్త్రచికిత్సలు అందించి వస్తాయి. ఒకవేళ ఆవుకు అత్యవసర చికిత్స అవసరమైతే ఈ వాహనంలో ఉండే హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా ఆవును ఈ వాహనంలోనే ఎక్కించి, నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యచికిత్సలు అందిస్తారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు 6 పశు సంచార వైద్యశాలలు మంజూరు కాగా మొదటి దశలో రెండేళ్ల అగ్రిమెంట్ కింద ఓ సంస్థ నిర్వహణ బాధ్యతలు తీసుకుని నిర్వహించింది. గత డిసెంబరులో ఈ అగ్రిమెంట్ పూర్తి కావడంతో డిసెంబరు నుంచి ఈ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పశువులకు వైద్యసేవలు అందకుండా పోయాయి. అంతేకాకుండా వైసీపీ పాలనలో ఈ వైద్యసేవల వాహనాల్లో అవసరమైన మందులు సరఫరా చేయలేదనే ఆరోపణలతో పాటు, విధులు నిర్వహించే సిబ్బందికి ఐదు నెలల పాటు వేతనం మంజూరు చేయలేదు. 2023 సంవత్సరం రెండో దశలో ప్రారంభించిన ఏడు పశు సంచార వైద్యశాల వాహనాలు ఇప్పటికీ తిరుగుతూనే ఉండటంతో కొద్దో గొప్పో పశువులకు వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రభుత్వం చర్యలు

జిల్లాలో పశు సంచార వైద్యశాల సేవలను పునఃప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 340 సంచార పశువైద్యసేవల వాహనాలను నిర్వహణకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో హెచ్ 1గా నిలిచిన భవ్య సంస్థకు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించింది. ఒక్కో వాహనం నిర్వహణకు నెలకు రూ.1,64,500 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ క్రమంలో ఈ వాహనంలో వెటర్నరీ సైన్సు హౌస్‌సర్జన్ చేసిన ఓ వైద్యుడు, డిప్లొమో చేసిన కాంపౌండర్, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. కాల్ సెంటర్‌కు ఫోన్ వచ్చిన వెంటనే వారి దిశానిర్దేశం మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్యసేవలు అందిస్తారు. వైద్యుడికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు, కాంపౌండర్‌కు రూ.20 వేలు, డ్రైవర్ కమ్ అటెండర్‌కు రూ.10,500 వేతనాలు చెల్లిస్తారు.

అందుబాటులో వైద్యసేవలు

పశు సంచార వైద్యశాలలో పశువులకు సంబంధించి రక్త పరీక్షలు, మూత్రం, పేడ పరీక్షలు, పాలు పరీక్షలు నిర్వహించడానికి మైక్రోస్కోప్ ఉంటుంది. నట్టల నివారణకు తినిపించే మందు, డీ-వార్మింగ్ మందులు వ్యాక్సినేషన్, ప్రథమ చికిత్స మందులు, చిన్నచిన్న శస్త్రచికిత్సల పరికరాలు అందుబాటులో వుంటాయి.

మూలన పడ్డ ఆరు వాహనాలు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు మొదటి దశలో మంజూరైన ఆరు పశు సంచార వైద్యసేవల వాహనాలు డిసెంబరు నాటికి కాంట్రాక్టు ముగియడంతో నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆయా పశువైద్యశాలల ఆవరణంలో మూలన నిలిపి ఉంచారు. వాహనాల నిర్వహణ లేకపోవడంతో బ్యాటరీలు డెడ్ అయ్యాయి. టైర్లతో గాలి తగ్గిపోయి, రోడ్డు మీద తిరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వాహనాలు రోడ్లపైకి రావాలంటే మరమ్మతులు తప్పనిసరి.

13 వాహనాలతో వైద్యసేవలందిస్తాం

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పశువులకు గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించేందుకు ఈనెలాఖరుకు 13 వాహనాలు సిద్ధం చేస్తున్నాం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ ప్రతినిధులు ఇప్పటికే నిలిచిపోయిన ఆరు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించి, చిన్నచిన్న రిపేర్లు ఉంటే చేయిస్తున్నారు. ప్రస్తుతం తిరుగుతున్న ఏడు వాహనాలతో పాటు మిగిలిన ఆరు వాహనాలు సిద్ధం చేసి పశువులకు సంచార వైద్యశాల నుంచి వైద్యసేవలందిస్తాం.

- డాక్టర్ గుణశేఖర్ పిళ్లై,
పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి, రాయచోటి.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కాట్

- డీఈవో సుబ్రమణ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల కో-ఆపరేటివ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్కౌట్ నూతన యూనిట్‌ను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటిసారిగా కబ్ (బాలురు), బుల్ బుల్ (బాలికలు) యూనిట్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు చొరవ చూపిన ఫ్లాక్ లీడర్ ధనలక్ష్మికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, పాఠశాల హెడ్ టీచర్ వీరమ్మ, యూనిట్ లీడర్ మడితాటి ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మెన్ వహిదా, ఉపాధ్యాయులు వెంకటయ్య, రాధమ్మ, విమలకుమారి, చెంచురెడ్డి, లీలావతమ్మ, సరితమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయకపోతే రేషన్ కార్డులు గల్లంతే

- సబ్ కలెక్టరు మేఘస్వరూప్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కలికిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెలాఖరుకు పూర్తి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. కేవైసీ పూర్తి కాని రేషను కార్డులు నిరర్థకమవుతాయని, రేషన్ సరుకులు కూడా వారికి పంపిణీ కాబోవని ఆయన చెప్పారు. మంగళవారం స్థానిక సైనిక పాఠశాలలో జరిగిన యూఎల్‌టీ సమావేశానికి హాజరయ్యా రు. అది పూర్తయిన అనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దారు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పేదలు ఆక్రమించుకున్న స్థలాలను క్రమబద్ధీకరించే వెసులుబాటును క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించి క్రమబద్ధీకరించుకునే విధంగా అవకాశం కల్పించాలని చెప్పారు. చెరువుల ఆయకట్టు ద్వారా సాగయ్యే భూములకు నీటి తీరువా వసూళ్ల కోసం డిమాండ్లు తయారు చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజా వేదిక ద్వారా వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీబాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దళితులకు ఎక్కడా అన్యాయం జరగరాదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లు ఆర్డీవోను అడిషనల్ ఎస్పీని, డీఎస్పీలను ఆదేశించారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు.

ప్రతి మండలంలో ఆఖరి శనివారం రోజున సివిల్ రైట్స్‌డే తప్పకుండా జరిపి దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జయప్రకాశ్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాజంపేట, మదనపల్లె డివిజన్ల డీఎస్పీలు, డీవీఎంసీ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ బాలింత మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని కోటావూరు పంచాయతీ బూదలవారిపల్లెకు చెందిన గాయత్రి(25)తన భర్త రాజేష్‌తో కలిసి బెంగళూరులో నివాసం వుంటోంది. ఇటీవల బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో కాన్పు అవడంతో పాటు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. తీవ్రమైన కడుపునొప్పి రావడంతో చికిత్స చేయించుకుంది. అయినా తగ్గక పోవడంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె సోమవారం మృతి చెందింది. దీనిపై విచారణ చేయాలంటూ మృతురాలి అన్న రెడ్డిప్రవీణ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం కాల్చివేత



రంగనాయకులపేటలో కాలిపోయిన స్కూటర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకుల పేటలో అఫ్సర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారని మంగళవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు మీడియాతో మాట్లాడుతూ ఇంట్లో తాము నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన స్కూటర్‌ను కాల్చివేసినట్లు తెలిపాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరడంతో వారు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



యశశ్విత (ఫైల్)

రాయచోటిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని ఏజీ గార్డెన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యశశ్విత (8) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... చిన్నమండెం మండలం చాకిబండ కురవపల్లెకు చెందిన కోటకొండ రామదాసు, సుజాత దంపతులు రాయచోటి పట్టణంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యశశ్విని మూడో సంతానం. మంగళవారం రాయచోటి- చిన్నమండెం మార్గంలోని ఏజీ గార్డెన్, గొర్లముదివేడు క్రాస్‌కు మధ్యలో దుకాణాల వద్ద తండ్రీకూతురు రోడ్డు దాటు తుండగా చిన్నమండెం వైపు నుంచి రాయచోటి వస్తున్న బొలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో యశశ్విత మృతిచెందింది. ఈ మేరకు రాయచోటి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించండి



ఆక్రమణలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

- జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

గుర్రంకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీడీవో క్వార్టర్స్ అక్రమాలను తొలగించాలని మంగళవారం చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు అధికారులకు సూచించారు. పట్టణంలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ఉన్న వీడీవో క్వార్టర్స్ భవనం కొన్నేళ్లుగా ఖాళీగా ఉంటూ పాడుపడిందని, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కొందరు నాయకులు అక్రమించుకొని అందులో రేకుల షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వీడీవో క్వార్టర్స్ స్థలం ఆక్రమణలపై గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం ఆక్రమాలను తొలగించాలని ఎంపీడీవో వెంకటేశులకు సూచించారు. ఆక్రమాలను తొలగించిన వెంటనే అందులో షాపింగ్ రూములు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో నాగశివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నడి రోడ్డుపై వైసీపీ నేత జన్మదిన వేడుకలు

- ఆరుగురిపై కేసు నమోదు

పీలేరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ నేతల ఆగడాలకు అంతు ఉండడం లేదు. అధికారంలో ఉండగా ప్రవర్తించినట్లుగానే ఇప్పుడూ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకు పీలేరులో మంగళవారం జరిగిన సంఘటన తాజా సాక్ష్యంగా నిలుస్తోంది. పీలేరు పట్టణానికి చెందిన వైసీపీ నేత, రాజంపేట పార్లమెంటరీ యూత్ విభాగం ప్రధాన కార్యదరి కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం తన జన్మదినం జరుపుకున్నారు. అదీ మందీ మార్బలంతో పీలేరు-కడప ప్రధాన రహదారిపై కార్లు, స్కూటర్లు అడ్డుపెట్టి మరీ కేక్‌లు కట్ చేయడమే కాకుండా పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ట్రాఫిక్‌కు అంతరాయంగానే కాకుండా అక్కడున్న వారి ప్రవర్తన ఇబ్బందికరంగా ఉండడంతో స్థానికులు పీలేరు అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని కృష్ణచైతన్య రెడ్డితోపాటు చాంద్‌బాషా, శేఖర్‌రెడ్డి, విష్ణుప్రభు, నవీన్ కుమార్ రెడ్డి, వినోద్‌లతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. ఒక కారుతో సహా మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

పెద్దమండ్యం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచెర్లలో అక్రమంగా రాయచోటికి తరలిస్తున్న 417 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీవీ రమణ తెలిపారు. రాయచోటిటౌన్‌కు చెందిన చాంద్‌బాష టాటా సుమోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, బియ్యం బస్తాలను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కరకాలంగా ఎదురుచూపు

- ఇళ్ల పట్టాల కోసం ఆర్టీసీ కార్మికుల నిరీక్షణ
- రూ.రెండు కోట్లు వసూలు చేసినా చేతికందని పట్టాలు
- గత ప్రభుత్వంలో ప్లాట్లు వేసి స్లిప్పులు పంచిపెట్టారు
- ఈ ప్రభుత్వంలోనైనా పట్టాలు చేతికందేనా అంటూ కార్మికుల ఎదురుచూపులు



పీలేరు మండలం నెట్టిబండ వద్ద ఇళ్ల స్థలాల కోసం ఆర్టీసీ కార్మికులు రైతుల వద్ద కొన్న భూమి



వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరున వేసిన శిలాఫలకం

పీలేరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఆర్టీసీ కార్మికులు రేపో మాపో ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చేస్తారు.... సొంత ఇంటి కల నెరవేరుతుందని కోటి ఆశలతో అధికారులు చెప్పే మాయమాటలు నమ్మి పుష్కర కాలంగా ఎదురు చూస్తూనే ఉన్నారు. పన్నెండి... పట్టాలు ఇవ్వడమే తరువాయి అంటూ నాటి నుంచి నేటి వరకూ కార్మికులను వంచిస్తూనే ఉన్నారు. ఇంకెంత కాలం వేచి ఉండాలో అర్థం కాక కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఒక్కో కార్మికుడి వద్ద నుంచి రూ.40 వేలు చొప్పున రెండు కోట్లు వసూలు చేసినా ఇంకా పట్టాలు చేతికందకపోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఇంటి స్థలం కోసం డబ్బులిచ్చిన కార్మికులలో పలువురు పదవీ కూడా విరమణ చేశారు. పీలేరు ఆర్టీసీ డిపోలో సుమారు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 480 మందితో 2013 అక్టోబరు 21న ఏపీఎస్ఆర్టీసీ హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు స్థల సేకరణ కోసం ఒక్కో కార్మికుడి వద్ద రెండు విడతలలో రూ.40 వేలు చొప్పున వసూలు చేశారు. కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులో రూ.1.21 కోట్లతో పీలేరు మండలం ఎర్రగుంట్లపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ సమీపంలో సర్వే నెంబర్లు-774-2లో 4.72 ఎకరాలు, 657-4లో 2.60 ఎకరాలు, 655-బీ5లో 2.85 ఎకరాలు, 657-6లో 1.52 ఎకరాలు, 657-3లో 1.50 ఎకరాలు, 657-7లో 20 సెంట్లు, 776-2లో 32.38 ఎకరాలు, ఇలా పలువురి వద్ద 15.77 ఎకరాల డీకేటీ భూములు కొన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో హౌసింగ్ సొసైటీ కమిటీ ఏర్పాటు చేశారు.

కేసులు...అరెస్టులు...

పలువురి రైతుల వద్ద భూములు కొన్నా వాటిని కార్మికులకు చూపకపోవడంతో కొందరు సొసైటీ సభ్యులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. సొసైటీ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించడం లేదని, ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కొందరు పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఆర్టీసీ నిబంధనల ప్రకారం సంస్థ పేరుతో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదు. అయితే సంస్థ అనుమతి లేకుండానే అప్పట్లో ఇక్కడ పనిచేస్తున్న ఓ అధికారి ఇష్టానుసారంగా వ్యవహరించి సంస్థ పరువు బజారుకీడుస్తున్నారని కార్మికులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఇంతటితో ఊరుకోని కార్మికులు ఎస్పీ, ఆర్టీసీ ఎండీకి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసులు వేయడం, పలువురు సభ్యులను అరెస్ట్ చేయడం, బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోయాయి. దీంతో కార్మికుల్లో సర్వత్రా ఉత్కంఠ, ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆర్టీసీ కార్మిక సంఘ నాయకుల అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో సంప్రదించి ఎలాగైనా ఆర్టీసీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కార్మికులు పలువురు రైతుల వద్ద కొన్న 15.77 ఎకరాలు ఉంది, అందులో అందరికీ పట్టాలు ఇద్దామని భరోసా ఇచ్చారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్టీసీ నగర్ పేరుతో కార్మికులు కొన్న స్థలాన్ని చదును చేయించి లేఔట్ వేశారు. ఇక్కడే కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని నమ్మించి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వకుండా కేవలం ప్లాట్ నెంబర్ ఉన్న స్లిప్పులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మరోవైపు కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారం కాకపోవడంతో కార్మికుల సొంతింటి కల స్లిప్పులకే పరిమితమైంది. కోర్టులో ఉన్న కేసుల పరిష్కారం కోసం కొందరు యూనియన్ నేతలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. పుష్కర కాలం గడచిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వాస్తవ పరిస్థితులను గుర్తించి తమకు కేటాయించిన ప్లాట్లలో ఇంటి పట్టాలు ఇప్పించి తమను ఆదుకోవాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

కార్మికులకు న్యాయం చేస్తాం...



కార్మికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలు ఇప్పించి వారికి న్యాయం చేస్తాం. ఇందు కోసం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డితో సంప్రదిస్తాం. వీలైనంత త్వరగా కార్మికుల చిరకాల వాంఛ నెరవేర్చడం కోసం ఉన్న అడ్డంకులను సామరస్యంగా పరిష్కరిస్తాం. ఇళ్ల పట్టాల కోసం ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కార్మికులకు అండగా ఉంటాం.

-శ్రీనాథరెడ్డి,
ఈయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు, పీలేరు.

అందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం...



చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కార్మికులందరికీ పట్టాలు ఇప్పించడమే లక్ష్యం. ఇప్పటికే ఈ దిశగా ముందుకుపోతున్నాం. ఇందుకు అవసరమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా సమిష్టిగా ముందుకు పోతాం. కార్మికులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. కాస్త ఆలస్యమైనా అందరికీ న్యాయం చేస్తాం.

-పీఎస్ఎం రాజు,
ఎన్ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీలేరు.

అధైర్య పడాల్సిన అవసరం లేదు....



పీలేరు డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అందరికీ న్యాయం చేస్తాం. సమస్యను ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే ఆలస్యమైంది. గత పాలకులు సక్రమంగా పట్టించుకోకపోవడం వల్లే ఇబ్బందులు. అందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించడం తక్షణ కర్తవ్యం.

- వై.రెడ్డెప్పరెడ్డి,
ఎన్ఎంయూ పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు

హైస్కూల్ ప్లస్‌కు స్వస్తి

- జూనియర్ కళాశాలలుగా మార్చాలనే యోచన
- మండలానికి ఒక కళాశాల ఉండేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు
- యథాతథంగా కొనసాగించాలని ఉపాధ్యాయుల డిమాండ్



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న హైస్కూ ల్ ప్లస్‌లు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతాయా లేదా అనే సందిగ్ధత నెలకొంది. వీటి కొనసాగింపుపై ఇప్పటికే ఉన్నతాధికారులు పరోక్షంగా పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలలో స్పష్టత ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగించి వాటి స్థానంలో జూనియర్ కళాశా లలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కానీ ఉపాధ్యాయులు మాత్రం వాటిని యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాలను కూడా అందజేశారు.

ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. వీటిని తొలగిస్తామని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయ డంతో అందులో పనిచేసే సిబ్బంది డైలమాలో పడ్డారు. గత ప్రభు త్వం 2022లో 10 హైస్కూల్ ప్లస్‌లను (మహిళా జూనియర్ కళా శాలలు) ఏర్పాటు చేసి కేవలం బాలికలకు అవకాశం కల్పించారు. వీటికి అదనంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి మరో 18 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఎన్నికల ముందు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో 28 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా.. వాటిలో 14 మాత్రమే కొనసాగుతున్నాయి.

మండలాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలను మెర్జ్ చేసి హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్మీడియట్‌ను పరిమితమైన గ్రూపులతో సిబ్బంది కొరతతో జడ్పీ హైస్కూల్లోనే నిర్వహిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన పది హైస్కూల్ ప్లస్‌లలో పూర్తి స్థాయిలో సిబ్బంది, గ్రూపులను ఏర్పాటు చేయకుండానే మళ్లీ 18 ఏర్పాటు చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ముందు 18 కోఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గత ప్రభుత్వం అందులో సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీనిపై ఉపాధ్యాయులు అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోయింది. హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో విమర్శలు వెల్లువెత్తాయి. గత రెండేళ్లుగా ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో విద్యార్థులు దారుణంగా ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాఠశాలలతో పాటు హైస్కూల్ ప్లస్‌లను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది.

హైస్కూల్ ప్లస్ సిబ్బందిలో గుబులు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగిస్తారంటూ ప్రచారం జరుగుతుండడంతో వాటిలో పనిచేసే సిబ్బందిలో గుబులు పుడుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం మొదట 10 హైస్కూల్ ప్లస్‌లు ఏర్పాటు చేసినప్పుడు వారికి పాఠాలను బోధించడానికి పాఠశాల విద్యలోని ఆయా యాజమాన్యాలలో పనిచేసే అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను పీజీటీలుగా పదోన్నతులు ఇచ్చి నియ మించారు. అయితే ఇపుడు ఈ హైస్కూల్ ప్లస్‌లు జూనియర్ కళాశాలలుగా రూపాంతరం చెందిన తర్వాత అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను తిరిగి వెనక్కి అంటే పూర్వం పనిచేసే పాఠశా లలకు స్కూల్ అసిస్టెంట్లుగా పంపుతామని అధికారులు ఉపాధ్యా య సంఘాల నేతలకు చెబుతున్నారు. దీంతో హైస్కూల్ ప్లస్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ ప్లస్‌లను జూని యర్ కళాశాలలుగా ఏర్పాటు చేసినా.. తదుపరి జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నారు.

తలనొప్పిగా మారిన జీఓ 302, 223

ప్రస్తుతం ఉన్న హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మారిస్తే నిబంధనల ప్రకారం జీఓ 302, 223లను అనుసరించి సిబ్బంది నియామక ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఈ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యలో పనిచేసే ఉపాధ్యాయులను నియమించే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికి 1979 నుంచి ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఓలు ఇలా ఉన్నాయి. జీఓ 939 ప్రకారం జిల్లా పరిషత్, మున్సిపల్ టీచర్లకు 25శాతం, ప్రభుత్వ టీచర్లకు 25శాతం పదోన్నతుల కోటాలో భర్తీ చేయాలి. మిగిలిన 50శాతం మందిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకోవాలి. 1993లో తీసుకువచ్చిన 302 జీవో ప్రకారం 50శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 40శాతం జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన 10శాతం నాన్ టీచింగ్ స్టాఫ్ ద్వారా భర్తీ చేయాలి. ఇందులో గతంలో ఉన్న మున్సిపల్ టీచర్స్ 25శాతం కోటాను తొలగించారు. ఆ తదుపరి 2008లో తీసుకువచ్చిన 223 జీవో ప్రకారం 90శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 10 శాతం నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో అప్పటి వరకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న 40శాతం కోటాను తొలగించారు. ఇలా జీఓ 302లో మున్సిపల్ టీచర్ల కోటాను, జీఓ 223లో జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్ల కోటాను తొలగించారు. ఇపుడు జీఓ 223ను తొలగించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండ డంతో పాటు మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా 1979లో తీసుకు వచ్చిన 939 జీఓను తిరిగి అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేస్తున్నారు.

పశు పోషణతో రైతులకు ఆర్థిక బలం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలలోపేతం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జేడీ శారదమ్మ అధ్యక్షతన పశుసంవర్థక శాఖ జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి, పశు సంవర్ధకశాఖల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని ఎన్ఎల్ఎం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పశు సంవర్ధక శాఖ కీలకమన్నారు. జిల్లాలో పశు పోషణ, జంతు సంరక్షణ చాలా చక్కగా జరుగుతోందన్నారు. ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధవహిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి చాలా తక్కువగా ఉందని, జిల్లాలో మాంసం ఉత్పత్తులను కూడా అధికంగా పెంచాలన్నారు. లైవ్ స్టాక్ మిషన్ ద్వారా రైతులు జిల్లాలో మేలు రకమైన జంతు జాతులను ఉత్పత్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మినీ గోకులాలు, పౌల్ట్రీ, పాల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం అవసరం అయిన అనుకూలతలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పశుసంవర్ధక శాఖ డీడీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తిచేయాలి



వాటర్ గ్రిడ్ పనులను పరిశీలిస్తున్న విజయ్ దత్వాలియా

లింగాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గం ప్రజలకు తాగునీరు అందించేందుకు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌డబ్ల్యూఎస్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ విజయ్ దత్వాలియా అన్నారు. లింగాల మండల పార్నపల్లె సమీపంలో నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం అక్కులగారిపల్లెలో పర్యటించి ప్రజలకు సరఫరా చేస్తున్న నీటికి నీటిశుద్ధి పరీక్షలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీ విద్యార్థిని ప్రతిభ



ఎర్రగుంట్ల, ఏప్రి ల్ 22 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఆర్టీపీపీకి చెందిన పార్లపల్లె పూజిత 991/1000 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని 10వ తరగతి వరకు ఆర్టీపీపీలోని డీఏవీలో చదివింది. పూజిత తండ్రి రామాంజనేయులు ఆర్టీపీపీలో స్టేజ్-4లో డీఈగా పనిచేస్తున్నారు. పూజిత మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈఓపై కేసు

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె విశ్రాంత ఎంఈఓ బండి వీరారెడ్డి, ఆయన కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. జడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

పులివెందుల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండారెడ్డి కాలనీకి చెందిన స్పందన అనే బాలిక అదృశ్యమైనట్లు అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన స్పందన సోమవారం అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

ప్రతీకారంతోనే హత్య

- నలుగురు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కడప బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద ఈ నెల 15న సాదక్‌వల్లి అనే పండ్ల వ్యాపారిని ప్రతీకారంతోనే దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నలుగురు నిందితులను తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

కడప పట్టణంలోని రవీంద్రనగర్‌లో కాటికాపరి వీధికి చెందిన షేక్ సాదక్‌వల్లి పాత బస్టాండులో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుండేవాడు. 2024 సంవత్సరంలో చింపిరి వెంకటేశ్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశాడు. ఈ కేసులో సాదక్‌వల్లి జైలుకు వెళ్లి బెయిలుపై బయటికి వచ్చాడు. అయితే చింపిరి వెంకటేశ్‌ను హత్య చేసినందుకు ప్రతీకారంగా అతని బంధువు రవీంద్రనగర్‌లోని మరాఠీవీధికి చెందిన చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు ఈనెల 15న రాత్రి 8గంటలకు సాదక్‌వల్లి బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాపు వద్ద నిలబడి ఉండగా పథకం ప్రకారం తన అనుచరులుతో కలిసి కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ కేసులోని నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

22న మంగళవారం మధ్యాహ్నం నిందితులు రామరాజుపల్లెలోని వైజంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు తులసి నాగప్రసాద్, తాహిర్‌హుసేన్ సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అరెస్టు అయిన వారి వివరాలు....

సాదక్‌వలి హత్య కేసులో అరెస్టు అయిన వారిలో చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు బేల్దారి, కడప మోచంపేటకు చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ కాలియా బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరియాపురానికి చెందిన శీలం బాల స్వామి కారు డ్రైవరుగా, మరాఠవీధికి చెందిన సుంకర వెంకటేశ్ హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో రాయప్ప, గౌస్‌బాషా, బాలస్వామిలపై రౌడీషీట్‌లు ఉన్నాయి. ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

కమలాపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని బంగారు గొలుసు (సరుడు)ను పట్టపగలే దొంగలు అపహరించుకు వెళ్లిన ఘటన కోగటం గ్రామంలో జరిగింది. గ్రామస్థుల వివరాల మేరకు... మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కోగటం గ్రామ సమీపంలోని తమ పొలంలో బండి వెంకటలక్షుమ్మ అనే మహిళ ఒంటరిగా పశువుల మేత కోసం గడ్డిని కోసేందుకు వెళ్లింది. గడ్డి కోస్తుండగా అక్కడ ఎవరూ లేరని గుర్తించిన దుండగుడు ఆమె వద్దకు వచ్చి ఉన్నట్లుండి మెడలోని 2లక్షల విలువైన బంగారు సరుడును లాక్కుని పరారయ్యాడు. ఈ విషయాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో హుటాహుటిన చోరీకి గురైన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళలు ఒంటరిగా పొలాలు, ఊర్లకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించి వెళ్లకూడదని సూచించారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



వెంకట నరసింహులు మృతదేహం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై సానా వెంకట నరసింహులు అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరు పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన సానా వెంటరమణ రెండో కుమారుడు వెంకట నరసింహులు (24) చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసు కుంటూ వుండేవాడు. ఎవరో అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ విఫలమై చాలా రోజుల నుంచి తనలో తానే బాధపడుతూ వుండేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21 తేదీ రాత్రి 7 గంటలకు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. సోదరుడు సురేష్ ఫిర్యాదు మేకు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ



జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ బైపీసీలో మండల టాపర్‌గా నిలిచి 695 మార్కులు సాధించిన హేమలతకు, సీఈసీలో 625 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన ఏంజల్ ప్రణీతకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు వీలైనంత ఎక్కువ మందిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన ఇటీవల ఉపాధ్యాయుల మధ్య జరిగిన ఘర్షణ, కేసుల గురించి వేర్వేరుగా సమావేశం నిర్వహించి ఆరా తీశారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బాధ్యతగా పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, ఆర్‌వీ రమేష్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మైసూరారెడ్డి, పోలిరెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని... మద్యం దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ అధికా రులతో సమీక్ష నిర్వహించారు. మద్యం దుకాణాలను తనిఖీ చేసి స్టాకు వివరాలను పరిశీలించాలని... ఎవరైనా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటుసారా నిర్మూలనపై నవోదయ కార్యక్రమాలు నిర్వహించి.. జిల్లాను సారారహిత జిల్లాగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ఎక్సైజ్ కేసులు ఏవైనా పెండింగులో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి : ఎస్ఈ



విద్యుత్ అధికారులు సిబ్బంతో సమీక్షిస్తున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఒక్క క్షణం కరెంటు పోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని.. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సూపరిండెంట్ ఇంజనీర్ రమణ ఆదేశించారు. మంగళవారం ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలోని రామేశ్వరం సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. భద్రతా నియమాలు ఎలా పాటిస్తున్నారో పరిశీలించారు. మధ్యాహ్నం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నాటికి వ్యవసాయ సర్వీ సులు విడుదల చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు అందుబాటులో వున్నాయా లేదా విచారించారు. ఏప్రిల్, మే నెలలో అధికారులు సిబ్బందికి పని రెట్టింపు ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వాలిపోయిన స్తంభాలు, లూజులైన్లు ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూళ్లకు చర్యలు తీసుకుంటూ మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఈ రమణారెడ్డి, ఏడీఈలు, ఏఈలు ఈఆర్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేని అరటి మొక్కలు... నష్టపోతున్న రైతన్నలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అరటి సాగు చేస్తున్న రైతులకు నర్సరీల నుంచి నాణ్యత లేని అరటి మొక్కలను సరఫరా చేయడంతో పంట దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. వివరాల్లోకెళితే... ముసల్‌రెడ్డిపల్లెకు చెందిన సింగం వాసుదేవరెడ్డి తనకున్న నంద్యాలంపల్లి పొలంలో మూడున్నర ఎకరాల్లో సమారు 5వేల అరటి మొక్కలు సాగు చేశాడు. రైతు ఓ సంస్థకు చెందిన జి9 రకం మొక్కలు కావాలని ఆర్డర్ చేశాడు. కానీ ఆ డీలర్ ఆ మొక్కలు అని చెప్పి.. వాటికి బదులుగా రైతుకు తెలియకుండా మరో రకం మొక్కలను అందజేశారు. పంట సాగు మొదలైన 6 నెలల నుంచి అరటి చెట్లు విరిగి కింద పడటం, 7 నెలలకు పూత దశకు రావాల్సిన చెట్లు 10వ నెల వరకు పూతకు రాకపోవడం జరిగింది. ఏడాది గడచినా గెలలు కోతకు రాకపోవడంతో రైతు డీలర్‌ను సంప్రదిస్తే అతని నుంచి సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేది లేక పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాడు. దీంతో శాస్త్రవేత్త డాక్టర్ రేష్మా మంగళవారం అరటి తోటను పరిశీలించారు. వేరు వ్యవస్థకు సంబంధించిన శాంపుల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించి తగిన నివేదికలు అందజేస్తామని శాస్త్రవేత్త తెలిపారు. నివేదికలు రాగానే ఆ కంపెనీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఓ మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్ఏ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

పంట సాగుకు రూ.8లక్షలు ఖర్చు చేశా...



అధిక దిగుబడి సాధించాలని రూ.8లక్షలు వెచ్చించి పంట సాగు చేశాను. ఒక్క రూపాయ కూడా రాలేదు. ఇలాంటి నకిలీ నర్సరీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.
- వాసుదేవరెడ్డి, రైతు, ముసల్‌రెడ్డిపల్లి



అరటి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రేష్మా, హెచ్ఓ మల్లేశ్వర్‌రెడ్డి



గెల వేయకనే నేలకొరిగిన అరటి చెట్టు

ఒకేషనల్ కోర్సు వల్ల ఎన్నో లాభాలు

వల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒకేషనల్ కోర్సుల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయనిమోడల్ స్కూలు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు అన్నారు. మోడల్ స్కూలులో వృత్తివిద్య కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సమగ్రశిక్షఅభియాన్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు ముగిశాయి.అనంతరం సర్టిఫికెట్లు అందించారు.

సమస్యల వలయంలో రామకృష్ణానగర్

• కాలువల నిండా కంపచెట్లే • పిల్లలకు అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కడప రామకృష్ణానగర్ సమస్యల వలయంగా మారింది. కొన్ని వీధులకు సీసీ రోడ్లు ఉన్నా మిగతా చోట్ల అధ్వానంగా మట్టిరోడ్లు దర్శనమిస్తున్నాయి. ఇక పట్టపగలే వీధిలైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కనే చేతికందే ఎత్తులో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇది చిన్నపిల్లలకు సైతం అందే ఎత్తులో ఉంది. కనీసం ఆ ట్రాన్స్‌పార్మర్ చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయకపోవడం, ఎత్తులో లేకపోవడంతో అది ఎప్పటికైనా ప్రమాద కరంగా మారుతుంది. కొన్ని చోట్ల డ్రైనేజీ కాల్వలు లేక మురుగునీరంతా ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం, పగలు తేడా లేకుండా దోమల బెడదతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో మురుగునీరు ఇంకిపోతున్నప్పటికీ కొన్ని చోట్ల కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి మురుగునీరు పారడంలేదు. కనీసం అధికారులు స్పందించి కాల్వలో ఉన్న చెట్లు తొలగించాలంటూ కోరుతున్నారు. ఆర్‌కేనగర్ చివర ఉన్న ఇళ్ల చుట్టూ అధ్వానంగా రహదారులు ఉన్నాయి. మట్టిరోడ్లు కావడం, అందులో ఎత్తుగుంతలు ఉండడంతో వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బందులకు గురి కావాల్సిందే. వేసవికాలం కావడంతో నీటి సమస్య కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నీరు రెండురోజులకొకసారి వస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు తెలుపుతున్నారు. బీడీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపైనే మురుగునీరు నిలుస్తోంది.దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు కాల్వల్లో ఉన్న కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నియంత్రణ చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు



ఇంటి ముందు నిల్వ ఉన్న మురుగునీరు

మంచి ప్రవర్తనతో మెలగాలి

కడప రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఖైదీలు మంచి ప్రవర్తనతో శిక్షా కాలాన్ని పూర్తిచేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సెంట్రల్ జైలును విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉచిత న్యాయస హాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 గురించి తెలియజేశారు.

బ్రౌన్ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి 29న భూమిపూజ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్ర జ్యోతి): కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయ అదనపు భవన నిర్మాణానికి ఈ నెల 29వ తేదీ మంగళవారం ఉదయం శంకు స్థాపన, భూమిపూజ నిర్వహిస్తున్నట్లు సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి అతిథులుగా హాజరవుతారని, కలెక్టర్ బ్రౌన్ గ్రంథాలయ ప్రధాన పోషకులు డాక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరవుతారన్నారు. వైవీయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

వల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వల్లూరులోని గణేష్‌పురం బస్టాండు వద్ద బుధవారం మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో ఉచిత క్లినిక్ ఏర్పాటు చేశామని కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్యశిబిరంలో డాక్టర్ ప్రమోద ఆధ్వర్యంలో మహిళలకు వైద్యసేవలు అందిస్తామన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల ఫైనలియర్ స్టూడెంట్స్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పశువైద్య శిబిరాన్నికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వాణి, అధ్యాపకులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ భార్గవి, డాక్టర్ తిమ్మారెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మునెయ్య,పశువైద్య అధికారులు డాక్టర్ సుష్మిత, డాక్టర్ సునీల్, పీజీ స్టూడెంట్స్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలకు ప్రకటించిన జీవోలు జారీచేయాలి

కడప మారుతీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు మార్చి నెలకు గాను ఇవ్వాల్సిన 7,200 రూపాయల బ్యాలెన్స్ తాలూకు వేతనం చెల్లింపుతో పాటుగా వారికి ప్రకటించిన వాటికి జీవోలను తక్షణమే జారీ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు మంగళవారం రెవెన్యూ డివిజన్ అధికారి జాన్ ఇర్విన్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కడప నాగరాజుపేట,ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. మంగళవారం కాగితాలపెంటలోని పార్టీ జోనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంనిర్వహించారు. సీఎంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధిలో పరుగులు పెట్టిందన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫిక్ ఖాన్, గఫార్, సిరాజుద్దీన్, ముబారక్ బాష, గంగయ్య, సిద్ధిక్ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

కడప క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి సూచించారు. రిమ్స్ పీఎస్ పరిధిలో ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో మంగళవారం యువతా మేలుకో పేరిట మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ నాటక ప్రదర్శన నిర్వహించారు. పోలీసుకళాజాత బృందం ప్రదర్శించిన నాటకం వైద్య విద్యార్థులను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ నరసమ్మ, అధ్యాపకులు, వైద్యవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఆ నియామకాన్ని రద్దు చేయకపోతే ఆందోళన'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వేంపల్లి ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ డీఐఈఓగా గా నియమించడం సరైందికాదని, వెంటనే రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని రాయలసీమ విద్యార్థి సమాఖ్య (ఆర్.వి.యస్.) రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌వీఎస్. జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నాయకులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు



పాఠశాలలో చేరుతున్న విద్యార్థులు

వల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో తమ పిల్లలను చదివించాలని మంగళవారం వల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సర్వ శిక్ష అభియాన్ అధికారి నిత్యానందరాజు, ఏఎల్ఎస్‌సీవో విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వల్లూరులో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓలు లిల్లెమ్మ, విజయారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతి బాధాకరం



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి అర్పిస్తున్న బిషప్ సగినాల పాల్ ప్రకాష్

కడప కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శాంతిదూత పోప్ ఫ్రాన్సిస్ మృతి చెందడం బాధాకరమని కడప మేత్రాసన బిషప్ డాక్టర్ సగినాల పాల్‌ప్రకాశ్ అన్నారు. ఆయన ఆత్మశాంతి కోసంగా అఖిలభారత కథోలిక సంఘం కన్వీనర్ కె. బాలరాజు, కడప మేత్రాసన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మరియాపురం బిషప్ హౌస్‌లో ప్రత్యేక నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తొలుత పోప్ ఫ్రాన్సిస్ చిత్ర పటానికి బిషప్ పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఎస్‌ఎస్‌ఎస్ డైరెక్టర్ బాలరాజు, కడప డిన్ ప్రసాదరావు, కథోలిక క్రైస్తవ పెద్దలు టి. యాగప్ప,వై. జయపాల్, రవీంద్రబాబు, ఇలియాస్‌రెడ్డి, విక్టర్, ఫాదర్ దేవసహాయం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు..: పోప్ ఫ్రాన్సిస్ ఆత్మశాంతి కోసంగా బుధవారం మరియాపురం సెయింట్ మేరీస్ కథడ్రిల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నట్లు వెల్లడించారు.

మలేరియా నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మలేరియాను సమర్థవంతగా నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజామోహిద్దీన్, బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్ సూచించారు. మంగళవారం పులివెందులలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మలేరియా నివారణ, లక్షణాలు, చికిత్సపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ప్రత్యేక ప్రసంగాలు, సమాచార లఘుచిత్రాలు ప్రదర్శించారు.సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, పాఠశాల ప్రిన్సిపాల్ హరిత, ఆశా కార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు వైర్లు

సీకేదిన్నె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మూలవంక వద్ద విద్యుత్తు వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రోడ్డు సెంటర్‌లైట్స్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన వైర్లు రోడ్డు కింద ఏర్పాటు చేయాల్సి ఉండగా విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వైర్లు రోడ్డుపైకి ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనికితోడు వైర్లు కనెక్షన్ తెగిపోవడంతో లైట్లు వెలుగడంలేదు. ఎవరైనా పొరపాటున వైరు తగిలితే భారీ ప్రమాదం సంభవిస్తుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్, విద్యుత్తు శాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



తెగిన విద్యుత్తు వైరు

విద్యారంగ అభివృద్ధికి ఎనలేని సేవలు



జాఫర్ సాదిక్ దంపతులను సత్కరిస్తున్న సంగమేశ్వర పాఠశాలల అధినేత సుబ్బానాయుడు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదిన్నర సంవత్సరాలుగా ఎంఈవోగా పనిచేస్తూ పదవీ విరమణ పొందుతున్న ఎంఈవో జాఫర్ సాదిక్ విద్యారంగ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆవరణంలో ఈనెల 30న పదవి విరమణ పొందుతున్న ఎంఈవో జాఫర్ సాదిక్‌కు అభినందన సభ సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు అధ్యక్షతన జరిగింది. జాఫర్ సాదిక్ దంపతులకుఉపాధ్యాయులు, బంధువులు, పాఠశాలల కరస్పాండెంట్లు, రిటైర్డ్ ఎంఈఓలు, స్నేహితులు తదితరులు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత సుబ్బానాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, వేంపల్లె ఉషాకిరణ్ స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, కరస్పాండెంట్ భోగరాజు, ఎంఈఓ-2 అనిత, ఎంపీపీ రఘునాథరెడ్డి, హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ చెన్నారెడ్డి, ఎంఈఓలు గంగిరెడ్డి, చిన్నయ్య పలువురు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు



కడప కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి పలువురు మహిళా భక్తులు హాజరయ్యారు. కాగా ఈనెల 26వ తేదీ శనివారం శని త్రయోదశి సందర్భంగా ఆలయ అనుగ్రహ మండపంలో గల శనీశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నారు.

2న సామూహిక ఉచిత ఉపనయనాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శంకర జయంతిని పురస్కరించుకుని మే నెల 2వ తేదీ ఉదయం 9-15 నుంచి 10-15 గంటల లోపు దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉచిత ఉపనయాల కార్యక్రమం తలపెట్టినట్లు పలు బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు వెల్లడించారు. మంగళవారం స్థానిక దేవునికడప శివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని బ్రాహ్మణులు తమ వటువుల పేర్లను ఈనెల 30వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. హాజరయ్యే వటువులకు సంబంధించిన అన్ని వస్త్రాలు, పూజా సామగ్రితో పాటుగా వటువుతో వచ్చిన బంధువులకు భోజనసదుపాయం ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు విజయ్‌బట్టర్, జగన్నాథ మురళీస్వామి, శివసత్యకుమార్‌శర్మ, ప్రభాకర్‌శార్మ, ప్రదీప్‌శర్మ, ప్రశాంత్‌శర్మ, సుబ్బయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 9866853442, 6301243443 అనే నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జమిలి ఎన్నికలు అసాధ్యం : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికల ఆలోచన ఒక పిచ్చి తుగ్లక్ ఆలోచన అని, ఇది అనవసరం, అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశమంతటా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీకి , స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. ఇది జరగాలంటే రాజ్యాంగంలో ఆర్టికల్ 83, 85, 142, 144, 356కు రాజ్యాంగ సవరణలు జరగాలి, అది జరగాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలన్నారు. లోక్‌సభలో 362 మంది కావాలి కానీ మోదీ ప్రభుత్వానికి 293 మాత్రమే ఉన్నారన్నారు. రాజ్యసభలో 164 మంది కావాలి 121 మంది మాత్రమే ఉన్నారన్నారు.

అనాథలకు అన్నదానం

వేంపల్లె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ శరణాలయంలోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి జన్మదినం పురస్కరించుకొని అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేసి ఆశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వెంకటేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, మిఠాయిలు పంపిణీ

పులివెందుల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇప్పట్ల సమీపంలోని దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేష్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీరాములు, పులివెందుల బీజేపీ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్, కిసాన్ మోర్చా కన్వీనర్ ఉపేంద్రరెడ్డి, లింగాల మండల అధ్యక్షుడు విష్ణుయాదవ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో జాతీయ హెల్త్ మిషన్‌లో రెండేళ్లుగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీహెచ్‌ఓలు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆసంఘ రాష్ట్ర కార్యదర్శి సందీప్ కుమార్ మాట్లాడుతూ సీహెచ్‌ఓల జీత బత్యాల చెల్లింపులు ప్రభుత్వం సకాలంలో చెల్లించని కారణం గా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు 6 సంవత్స రాలుగా పని చేస్తున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలనీ డిమాండ్ చేశా రు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన సంఘటనలో ఫాదర్‌పై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి హర్షవర్ధన్‌ను కొట్టిన కేసులో హోలీరోసరీ ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఈ నెల 19న పోరుమామిళ్లలోని హోలీ రోసరీ ఇంగ్లీషు మీడియం స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ 8వతరగతి విద్యార్థి హర్షవర్ధన్‌ను రూములోని ఫ్యాను రెక్కలు వంచాడనే నెపంతో దోమతెర కట్టెతో వాతలు పడే విధంగా కొట్టాడని విద్యార్థి తండ్రి రామదాసు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాదర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోరీని ఢీకొన్న బస్సు తప్పిన ప్రమాదం

దువ్వూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు సమీపంలోని నాలుగు రోడ్ల రహదారిలో టూరిస్టు బస్సు మోరీని ఢీకొంది. కడపవైపు నుంచి కర్నూలువైపు వెళుతూ టైరు పంక్చర్ కావడంతో ఈ సంఘటన జరిగింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో బస్సులోని ప్రయాణికులు ఎటువంటి ప్రమాదం జరుగకుండా సురక్షితంగా బయటపడ్డారు.

తెలుగుగంగ పిల్లకాల్వలు అంతేనా..?

- కాల్వలు పూర్తయ్యేదెన్నడో అంటున్న ఆయకట్టు రైతులు
- 34 ఎకరాలకు పైగా నష్టపరిహారం చెల్లించాల్సిన వైనం



దమ్మనపల్లె వద్ద ఆగిపోయి ముళ్లపొదలతో నిండిన పిల్ల కాల్వ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు కింద పిల్ల కాల్వలు ఏళ్లతరబడి పూర్తికాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రధానకాల్వలు నిర్మించి లైనింగ్ పనులు పూర్తి చేసినా పిల్లకాల్వలు ఎందుకు పూర్తికాలేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. పోరుమామిళ్ల డివిజనుకు సంబంధించి పదేళ్లకు పైగా పిల్ల కాల్వలు పెండింగులో ఉండడంతో ఆ కాల్వలు పూర్తయ్యేదెన్నడు, పూర్తిస్థాయిలో నీరందేదెన్నడు అని రైతులు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాల్వల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లోని తెలుగుగంగ పిల్లకాల్వలను పూర్తి చేసి గంగ నీరు పూర్తిస్థాయిలో అందిస్తారని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. పోరుమామిళ్ల డివిజన్ పరిధిలో 2010 నుంచి ఈ కాల్వ పనులు నిలిచిపోయాయి. బ్లాక్-9 కింద నాలుగు బ్లాక్‌లలో పనులు పూర్తి కావాల్సి ఉంది. 9ఎ బ్లాక్‌కింద చింతలపల్లె నుంచి ముద్దంవారిపల్లెకు 3.6 కి.మీ కాల్వ పూర్తి కావాల్సి ఉండగా కొంత భాగం పెండింగ్‌లో ఉంది. 9బి బ్లాక్ కింద ఒకటిన్నర కి.మీ చింతలపల్లె నుంచి కట్టకిందపల్లె వరకు పనులు జరగాల్సి ఉండగా, అర్ధకిలోమీటరు మాత్రమే పనులు జరిగాయి. 9డి పరిధిలో దమ్మనపల్లె నుంచి రంగసముద్రం, ఈదుళ్లపల్లె నుంచి రంగసముద్రం వరకు పది కిలోమీటర్లు పని జరిగింది. దమ్మనపల్లె నుంచి ఈదుళ్లపల్లె వరకు మూడున్నర కి.మీ. పిల్ల కాల్వలు పూర్తికావాల్సి ఉంది. 9ఈ కింద దమ్మనపల్లె ప్రాంతంలో కాల్వలు పూర్తి కావాల్సి ఉంది. సుమారు దాదాపు 7 కి.మీ. పైగా ఈ పిల్ల కాల్వలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. రైతులకు సంబంధించి దాదాపు 34 ఎకరాలకు నష్టపరిహారం అందించాల్సి ఉంది. కాగా ఈ విషయంపై తెలుగు గంగ ఈఈ క్రిష్టారెడ్డిని వివరణ కోరగా 9 బ్లాక్‌కింద పిల్ల కాల్వలు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, కాల్వల పూర్తికి దాదాపు రూ.13.8 కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపామన్నారు. ఉన్నతాధికారులు ముందుగా రైతులకు నష్టపరిహారం అందించి పనులు పూర్తి చేయాలని తెలిపారన్నారు.

పిల్ల కాల్వలు పూర్తి చేయాలి

దమ్మనపల్లె ప్రాంతంలో 800మీటర్లు వరకు లైనింగ్ పనులు చేపట్టి మిగిలిన దాదాపు ఈదుళ్లపల్లె వరకు కాల్వలను అలాగే వదిలివేశారు. దమ్మనపల్లె నుంచి పిల్లక్వాలు పూర్తయితే నీరందే అవకాశాలున్నాయి. ఈ పిల్ల కాల్వలు పూర్తయితే దమ్మనపల్లె, నుంకేసులపల్లె వరకు దాదాపు 300 ఎకరాలకు రైతులకు సాగునీరందుతుంది.

- తోట బ్రహ్మయ్య, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు, దమ్మనపల్లె

ఆసుపత్రులను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



ఎర్రగుంట్లలో ఆసుపత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ నాగరాజు మంగళవారం పరిశీలించారు. రాణీవనంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను గదులను ఆయన తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించి గర్భవతులు, పుట్టిన పిల్లల నమోదులో పర్సెంటేజీలను పెంచాలన్నారు. అన్ని ఇండికేటర్స్‌లోను జిల్లా మొదటి స్థానం పొందేలా పనిచేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యుటి డీఎంహెచ్‌వో శివప్రసాద్‌రెడ్డి, మలేరియా అధికారిణి మనోరమ, వైద్యులు జ్యోష్న, శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ముద్దనూరు ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్ బేగంపేర్కొన్నారు.ముద్దనూరు టౌన్‌లోని అంగన్వాడీ కేంద్రంలో-3లో మంగళవారం పోషన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు క్రమం తప్పకుండా పోషకాలు కల్గిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమారాణి అంగన్వాడీ ఉపాధ్యాయురాలు కిరణ్మై బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కొండాపురంలో: గర్భిణులు, తల్లీబిడ్డలకు పోషకాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మంగళవారం గండ్లూరు, ఓబన్నపేట అంగనవాడీ కేంద్రాలలో పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించి పోషాకాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ వర్కర్లు పద్మావతి,వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

ఖాజీపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఓబన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పనపల్లె హైస్కూలులో ఎస్‌ఏగా పనిచేస్తున్న పెంచలయ్య పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎస్టీయూ జిల్లా నాయకుడు హాజరై ఆయనకు పూలమాల వేసి శాలువా వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రామమోహన్, మండల ప్రధాన కార్యదర్శి కరిముల్లా, ఎం.శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తిపై దాడి

జమ్మలమడుగు, ,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) :మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో మూలేంటి చిన్నఎల్లప్ప అనే వ్యక్తిపై దాడి జరిగింది. కోలాటం వద్ద గ్రామస్థులు గొడవపడ్డారు. మాటా మాట పెరిగ మూలేంటి గురుమోహన్, రామ్మోహన్, బాలగురప్ప అనే ముగ్గురు కలిసి చిన్నఎల్లపై దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్పను వివరణ కోరగా గండికోట కొట్టాలపల్లిలో కోలాటం నేర్చుకునేచోట గొడవ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవాలు

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని డాంకాన్‌పల్లె ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు నృత్యాలు పలువురిని అలరించారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఎంఈఓ పద్మలత బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో విస్తృత పర్యటన

ముద్దనూరు ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో మంగళవారం ఎంపీడీవో ముకుందారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. అందులో భాగంగా డీఎన్‌పల్లెలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీవో గంగయ్య, మేజర్ గ్రామ పంచాయతీ ఈవో నరసింహులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదురుగా నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

జమ్మలమడుగు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా మంగళవారం ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ఐటీయూసీ పట్టణ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొని ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

చాపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామంలో రాధాలక్ష్మి అనే మహిళ వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు ఈనెల 21న స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మద్యం బాటిళ్ల విలువ రూ.2 వేలు ఉంటాయన్నారు. అక్రమంగా ఆమె మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నందున కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం ఐదురోడ్ల కూడలిలో బి.మఠం ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బందితో దాడులు నిర్వహించి 8 మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకుని మండ్ల నరసింహులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసుకుని రిమాండుకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

వరి చెత్త కట్టలు అగ్నికి ఆహుతి

రాజుపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో దాదాపు 900 వరి చెత్త కట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. ఉప్పలూరు శేఖర్‌రెడ్డివి 500 కట్టలు, చాకలి లింగన్నవి 380 కట్టలు పూర్తిగా కాలిపోయాయి. శేఖర్‌రెడ్డికి రూ.40వేలు, లింగన్నకు రూ.38వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పశువుల నోటికాడి చెత్త కాలిపోవడంతో ఆవేదన చెందారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మనపల్లెలో విద్యుత్‌షాక్‌తో తోట జయరాంకు చెందిన పాడి గేదె మృతి చెందింది. మంగళవారం పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు గేదెకు తగిలి మృతి చెందిందని యజమాని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

బద్వేలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు కొరకు కేటాయించిన 3 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైన విషయం తెలుసుకున్న గోపవరం తహశీల్దారు త్రిభువన్ రెడ్డి రెవెన్యూ పురపాలక సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూరగాయల మార్కెట్ పనులు వేగవంతం చేయాలి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్లో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ కూరగాయల మార్కెట్ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని మార్కెట్ వ్యాపారులు కోరారు. ఆమేరకు ఎమ్మెల్యే వరదతోపాటు కమిషనర్ మల్లికార్జునకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ అసోషియేషన్ నాయకులు వలీబాషా షబ్బీర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.51 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినా దాదాపు 20 కోట్ల మేర పనులు జరిగి నిధులు విడుదల కాక పనులు ఆగిపోయాయన్నారు. ఇందుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సీఎం చంద్రబాబుతో మాట్లాడానని త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు.

సోమేశ్వరస్వామి భూములు కౌలుకు వేలం

రాజుపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు గ్రామంలోని సోమేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన భూములను 24న ఉదయం 11గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో కౌలుకు తీసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామచంద్రచార్యులు తెలిపారు. ఒక సంవత్సరానికిగాను కౌలుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10వేలు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనాలని తెలిపారు.

రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం రతనాల వెంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

ఘనంగా బీజేపీ అధ్యక్షురాలి జన్మదిన వేడుకలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన వేడుకలను పోరుమామిళ్లలోని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమణాచారి, ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, షకీలాబేగం, పల్లెంశెట్టి పండరి, వంకదారి జయరాం పాల్గొన్నారు.

సీపీఐ మహా సభలను విజయవంతం చేయండి

బద్వేలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి వారి కోసం ఒక బృహత్తర ఉద్యమ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు చేస్తారా.. చేయించుకోవాలా ?

- కలుషిత నీటితో ప్రజారోగ్యానికి ముప్పు
- ఎంపీడీవోకు వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, సర్పంచి శివలక్ష్మి ఫిర్యాదు



దెబ్బతిన్న తాగునీటి పైపులైను



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, సర్పంచు శివలక్ష్మి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక వాహనాలతో పెన్నా తీరం నుంచి గ్రామానికి సరఫరా అయ్యే మంచినీటి పైపులైన్లు దెబ్బతిన్నా ఎందుకు మరమ్మతులు చేయలేదని ప్రొద్దుటూరు మండల ఉపాధ్యక్షురాలు రెడ్డమ్మ ఎంపీడీవోను ప్రశ్నించారు. తాగునీరు కలుషితమై ప్రజా ఆరోగ్యానికి ప్రమాదంగా మారినా నిర్లక్ష్యమెందుకంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ మరమ్మతు పనులు చేస్తారా..? లేక తామే మరమ్మతులు చేయించాలా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమేరకు మంగళవారం కల్లూరు పంచాయతీ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మితో కలిసి ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి మండల ఉపాధ్యక్షురాలు రెడ్డమ్మ లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కల్లూరు గ్రామానికి పెన్నానది నుంచి మంచినీటి సరఫరా చేసే పైపులైన్లు వాహనాల ధాటికి దెబ్బతినడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పైపులైను రూటుమార్చి కొత్తపైపులైన్లు, పనులు చేసేందుకు పంచాయతీ గ్రామ సభలో తీర్మాణం అయిందని సర్పంచు తెలిపారు. పంచాయతీ తరుపు నుంచి కార్యదర్శి ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి విషయాన్ని తెలియజేసినట్లు వివరించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పనులకు సంబంధించిన ఎస్టిమేషన్లు ఇచ్చారని, కాంట్రాక్టర్‌కు వర్క్‌ఆర్డర్ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. ఈ తంతు పూర్తయి రెండు నెలలు దాటినా పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. అధికారులు పనులను ప్రారంభించకుంటే పంచాయతీ నిధులు, దాతల సహకారంతో పనులను చేయించగలమని ఎంపీడీవోకు వివరించారు.

పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించండి



ఇళ్ల స్థలాల విషయమై తహసీల్దారుకు విన్నవిస్తున్న పేదలు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలకోసం మూడు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని వెంటనే సమస్యను పరిష్కరించాలని అమృతనగర్ పేదలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బీఎస్పీ అధ్యక్షుడు తీట్ల రవి ఆధ్వర్యంలో అమృత్‌నగర్ పేదలు ఇళ్ల స్థలాల కోసం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు రవి మాట్లాడుతూ అమృతనగర్‌లోని ప్రభుత్వ ఇళ్లలోనే పేదలు అద్దెలకున్నారన్నారు, ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి ఇంటి స్థలం జగనన్న కాలనీల్లో మంజూరైనట్లు కొందరికి చూపిస్తున్నదని ఇంతవరకు ఈ పేదలకు ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. వారి దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు తహసీల్దారు గంగయ్య స్పందిస్తూ దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వీఆర్‌వోలు వచ్చి విచారణ చేస్తారని మీకు ఎక్కడా ఇంటి స్థలం మంజూరు కాకుంటే స్థలం కేటాయిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలో అద్దెకు ఉన్నారంటున్నారు కదా ఇంటి యజమాని పేరు ఆధార్ నెంబరు తెలపాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ ఇవ్వడంలేదు


- డీలర్ల పై ఫిర్యాదు చేసిన అంగన్ వాడీ సిబ్బంది

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యో తి) అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరుకులు ఇవ్వకుండా డీలర్లు ఇబ్బంది లకు గురి చేస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగ ళవారం స్థానిక తహసీల్దారు కార్యాల యం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు డీలర్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో రేషన్ సరుకులు అంగన్‌వాడీ కేంద్రాలకు చేర్చేవారని నేడు డీలర్ల వద్దకు వెళితే వారు వేలిముద్రలువేయించుకుని సరుకు ఇవ్వకుండా వేదిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ వర్కర్‌పై దాడి చేసిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆమేరకు తహసీల్దారు మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురష్కారాలు అందజేయనున్నట్లు పద్మశాలీయ అభ్యుదయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నా చంద్రబాబు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన 27వ ప్రతిభా పురష్కారాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఒక్కో గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. ఇంటర్మీడియట్‌లో 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. మే 25వ తేదీ పద్మశాలీయ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమెంటో అందజేస్తామని తెలిపారు. సంఘం సభ్యులు వద్దినాగరాజు, అవ్వారు శ్రీనివాసులు, జలదుర్గం మునిస్వామి, వద్ది ఉమానరసింహులు, బోగా ఆనంద్, కోటా సంజీవరాయుడు, జానకీరామయ్య పాల్గొన్నారు.

ఘనంగా జహంగీర్‌బాషా జన్మదిన వేడుకలు



సన్నిహితుల నడుమ కేక్ కోస్తున్న జహంగీర్‌బాషా

బద్వేలు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుయువత కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడు, మైనార్టీ నాయకుడు షేక్ జహంగీర్‌బాషా జన్మదిన వేడుకలు మంగళవారం స్నేహితులు, అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఆయన కార్యాలయంలో సన్నిహితులతో కలిసి కేక్ కట్‌చేసి పుట్టినరోజు వేడుకలు జరిపారు. ఈ సందర్భగా జహంగీర్‌బాషా మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నక్యాంటిన్‌లో మధ్యాహ్న భోజనం చేసేవారికి 350 టోకెన్లు ఉచితంగా అందించారు. ఈ కార్యక్ర మంలో మునిరెడ్డి, యల్లారెడ్డి, సుబ్బారెడ్డి, క్రిష్టారెడ్డి, రాజన్న, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఈడీ వెంకటసుబ్బయ్య, షేక్ ముస్తఫా, రసూల్, బిజివేముల చంద్రశేఖర్‌రెడ్డి, రఫీ, గొడుగునూరు ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

కాశినాయన ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంఈవో నిర్మల పేర్కొన్నా రు. మంగళవారం ప్రదానోపాద్యాయుడు వీవీ నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన పిట్టిగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిం చాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు డీఎంహెచ్‌వో డాక్టర్ మార్కారెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ వెంకటలక్షుమ్మ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌పై ఆకస్మిక తనిఖీ

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమంపై వైద్య, ఆరోగ్యశాఖ డీపీఎంవో డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మంగళవారం కల్లూరు, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె ప్రభుత్వ ఉన్నతపాఠశాల, కొత్తపల్లె గ్రామంలోని ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, పిల్లలు వడదెబ్బకు, అతిసార వ్యాధికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మహలక్ష్మి, సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్ పాల్గొన్నారు.